www.epaper.asthram.com

సామాన్యుడి అస్త్రం
తెలుగు దినపత్రిక

శుక్రవారం 19
డిసెంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 167 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## రూ. 2.20 లక్షలు దాటిన వెండి

ఒక్కరోజు గ్యాప్ తర్వాత వెండి ధరలు మరోసారి రికార్డు గరిష్టాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాలు బలంగా ఉండటం, సరఫరా ఆందోళనలు కొనసాగడం, వచ్చే ఏడాది అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాల మధ్య ధరలు అమాంతం ఊపందుకున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు సంబంధించి ఇన్వెస్టర్లు గురువారం విడుదలయ్యే నవంబర్ నెల డేటా కోసం, శుక్రవారం వెలువడే వ్యక్తిగత వినియోగ వ్యయం డేటా కోసం ఎదురుచూస్తున్న క్రమంలో విలువ లోహాలపై దృష్టి సారించారు. ప్రపంచ వాణిజ్యంలో బంగారం కంటే వెండికి గిరాకీ ఎక్కువగా కనిపిస్తోందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. దేశీయంగా కూడా గిరాకీతో పాటు పారిశ్రామిక వినియోగం పెరగడం వంటి పరిణామాల వల్ల కొత్త గరిష్ఠాలకు చేరుతోంది. బుధవారం వెండి కిలో ఏకంగా రూ.11,000 పెరిగి రూ. 2.22 లక్షల మార్కుకు చేరాయి.



## 2029లోనూ ఇవే..
# ఫలితాలు పునరావృతం

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చాయి
కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని విమర్శ
ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించారు

- కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్..
- 'కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి
- ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం
- గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు
- మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం
- కేటీఆర్ వచ్చాక బీఆర్ఎస్ గెలవలేదు..
- కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు..
- ఆయనతో ప్రయోజనం లేదని గజ్వేల్ ప్రజలకు అర్థమైంది

**హైదరాబాద్**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరని, అందుకే ఆయనతో ఎలాంటి ప్రయోజనం లేదని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు ఇచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని ఆయన అన్నారు. 12 వేలకు పైగా గ్రామపంచాయతీల్లో 7,500కు పైగా కాంగ్రెస్ విజయం సాధించిందని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని ఆయన విమర్శించారు. హరీశ్ రావు నాయకత్వం మార్చాలని చూస్తున్నారని, అందుకే కేటీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ గురించి ఆలోచించడం లేదని అన్నారు. స్పీకర్ నిర్ణయాలు నచ్చకపోతే కోర్టులు ఉన్నాయని, అక్కడికి వెళ్లవచ్చని సూచించారు. కృష్ణా, గోదావరి జలాలపై - మిగతా3లో

# రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు

- బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి స్టేషన్ కు తీసుకెళ్లి వేధించారు
- చిన్నకాపర్తిలో బ్యాలెట్ పేపర్లను పడేశారు
- రాష్ట్రంలో 100-150 గ్రామాల్లో బీఆర్ఎస్ గెలిచినా కాంగ్రెస్ గెలిచినట్లు ప్రకటించారు
- పార్టీ మారిన వాళ్లే సిగ్గులేకుండా చెప్పినా స్పీకర్‌కు వినపడటం లేదట
- పది మంది ఎమ్మెల్యేలు ఆడనా మగనా అని కూడా చెప్పుకోవడం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**భువనగిరి(యాదాద్రి భువనగిరి జిల్లా):**

రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు నడుస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈరోజు(గురువారం, డిసెంబర్ 18వ తేదీ) యాదాద్రి భువనగిరి జిల్లాలో నూతనంగా ఎన్నికలైన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ' రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు నడుస్తున్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి స్టేషన్ కు తీసుకెళ్లి వేధించారు. చిన్నకాపర్తిలో బ్యాలెట్ పేపర్లను పడేశారు. రాష్ట్రంలో 100-150 గ్రామాల్లో బీఆర్ఎస్ గెలిచినా కాంగ్రెస్ గెలిచినట్లు ప్రకటించారు. ఈ వ్యవహారంపై ఖచ్చితంగా కోర్టుకు వెళ్తాం. పార్టీ ఫిరాయింపులు స్పీకర్‌కు కనుబడటం లేదా.. పార్టీ మారిన వాళ్లే సిగ్గులేకుండా చెప్పినా - మిగతా3లో



## ప్రధాని మోదీకి ఒమన్
# అత్యున్నత పురస్కారం...

- 29వ అంతర్జాతీయ గౌరవం
- 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేసిన సుల్తాన్
- రెండు రోజుల క్రితం ఇథియోపియా నుంచి కూడా అత్యున్నత గౌరవం
- భారత్-ఒమన్ మధ్య కీలక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం
- ఇరు దేశాల 70 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా ఈ పర్యటన

## ఆర్థికంగా సంక్షోభంలో
# విద్యుత్ రంగం

- గత, ప్రస్తుత ప్రభుత్వాల అప్పులు తడిసి మోపెడయ్యాయి
- తెలంగాణకు విద్యుత్ ఉత్పత్తి విషయంలో అన్ని రకాలుగా సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది
- తెలంగాణలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, పంపిణీ సంస్థల.. అప్పుల బాటలో, నష్టాల ఊబిలో పేరుకుపోయాయి
- వేలకోట్ల రూపాయల అప్పుల భారాన్ని మోయలేక నడ్డి విరుగుతోంది
- తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కంపెనీకి 47 వేల కోట్ల రూపాయలు అప్పు ఉంది




**న్యూఢిల్లీ**

తెలంగాణ విద్యుత్ రంగం ఆర్థికంగా సంక్షోభంలో ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. గత, ప్రస్తుత ప్రభుత్వాల అప్పులు తడిసి మోపెడయ్యాయని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు విద్యుత్ ఉత్పత్తి విషయంలో అన్ని రకాలుగా సహకరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, పంపిణీ సంస్థల.. అప్పుల బాటలో, నష్టాల ఊబిలో పేరుకుపోయాయని- మిగతా3లో



## కష్టకాలం ముగిసింది.. అతిపెద్ద తుఫాను నుంచి బయటపడ్డాం

- ఎయిర్‌లైన్ రోజువారీ సర్వీసులు పునరుద్ధరించినట్లు వెల్లడి
- ప్రస్తుతం రోజుకు దాదాపు 2,200 విమానాలను నడుపుతున్నం
- పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఓసీసీ, కస్టమర్ సర్వీస్ ఇలా మాకు మద్దతు ఇచ్చిన అన్ని విభాగాల ఉద్యోగులకు ధన్యవాదాలు'



## బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం.. భారత్‌కు పెనుముప్పు

- షేక్ హసీనా కుమారుడు సాజిబ్
- ఉగ్రవాద శిబిరాలు పుట్టుకు వస్తున్నాయన్న సాజిబ్ వాజేద్
- బంగ్లాలో ఉగ్రచర్యలు భారత్ వంటి దేశాలకు ముప్పేనని వ్యాఖ్య
- లష్కరే తోయిబా కమాండర్లు బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్న సాజిబ్

## రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు...
# 26 మంది మృతి

- ఇప్పటివరకు 119 మందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చినట్టు వెల్లడి
- మరో 50 మంది విడుదల కోసం రష్యాతో చర్చలు జరుపుతున్నట్టు ప్రకటన
- మరణించిన వారిలో 10 మంది మృతదేహాలను స్వదేశానికి తరలింపు
- మృతుల గుర్తింపు కోసం 18 కుటుంబాల డీఎన్ఏ శాంపిళ్ల రష్యాకు పంపినట్టు వెల్లడి

# రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగింది



- రాష్ట్రంలో 900 సర్పంచులు 1200 ఉపసర్పంచ్లు 10,000 మంది వార్డులను గెలిచాం
- గతంలో 162 సర్పంచ్ స్థానాలను ఉండేది.
- గ్రామీణ ప్రాంతాలలో కూడా బీజేపీ బలం పెరుగుతుంది
- కాంగ్రెస్ పార్టీ అధికార బలంతో, అవినీతి, అరాచకంతో గెలిచింది
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ పథకాల పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది

**యాదాద్రి(భువనగిరి జిల్లా)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన బీజేపీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ' యాదాద్రి భువనగిరి జిల్లాలో 4 సర్పంచులు 20 మంది ఉపసర్పంచ్లు 1000 వార్డులు గెలిచాం. రాష్ట్రంలో 900 సర్పంచులు 1200 ఉపసర్పంచ్లు 10,000 మంది వార్డులను గెలిచాం. గతంలో 162 సర్పంచ్ స్థానాలను ఉండేది. గ్రామీణ ప్రాంతాలలో కూడా బీజేపీ బలం పెరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికార - మిగతా3లో

# వీబీ జీ రామ్‌జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. బిల్లుపై సుధీర్ఘంగా చర్చించారని చెప్పారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

**లోక్‌సభలో గందరగోళం..**

కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు.


మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారాయన. వీ+చీ=జు+ూా అవినీతి సాధనం తప్ప మరొకటి కాదని, అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అనంతరం సభను వాయిదా వేశారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. వీ+చీ=జు+ూా పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు ప్రియాంక. కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పై విసరడం సరికాదు. దేశంలోనే అతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు... 26 మంది మృతి



రష్యా సైన్యంలో 2022 నుంచి ఇప్పటివరకు 202 మంది భారతీయులు చేరారని, వారిలో 26 మంది మరణించగా, మరో ఏడుగురు గల్లంతయ్యారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే, కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలు తెలిపారు. భారత్ చేపట్టిన దౌత్యపరమైన చర్యల ఫలితంగా ఇప్పటివరకు 119 మందిని రష్యా సైన్యం నుంచి విడిపించి వెనక్కి తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. మరో 50 మంది భారతీయులు ఇంకా విడుదల కోసం ఎదురుచూస్తున్నారని, వారి భద్రత, సంక్షేమం, వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. యుద్ధంలో మరణించిన 26 మందిలో 10 మంది మృతదేహాలను భారత్‌కు తరలించినట్లు ప్రభుత్వం ధృవీకరించింది. మరో ఇద్దరి అంత్యక్రియలు భారత రాయబార కార్యాలయం సహాయంతో రష్యాలోనే స్థానికంగా పూర్తి చేసినట్లు పేర్కొంది. మరణించిన లేదా గల్లంతైన వారిలో కొందరిని గుర్తించేందుకు, 18 మంది భారతీయుల కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను రష్యా అధికారులతో పంచుకున్నట్లు మంత్రి తెలిపారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం, సైన్యం నుంచి విడుదలైన వారికి ప్రయాణ పత్రాలు, విమాన టిక్కెట్లు, ఇతర లాజిస్టికల్ మద్దతు అందిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ అంశాన్ని ఇరు దేశాల నేతలు, మంత్రులు, ఉన్నతాధికారుల మధ్య జరిగిన పలు సమావేశాల్లో ప్రస్తావించినట్లు చెప్పింది. మిగిలిన భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే వరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని పార్లమెంటుకు హామీ ఇచ్చింది.

# శబరిమలకు రికార్డు స్థాయిలో ఆదాయం



శబరిమలలో అత్యధిక భక్తుల రద్దీ తర్వాత భారీ ఆదాయం వచ్చినట్లు దేవస్వం బోర్డు అధ్యక్షుడు కేకేక జయకుమార్ పేర్కొన్నారు. ఇందులో 106 కోట్ల రూపాయలను అమ్మకానికి కేటాయించారు. గతేడాది ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం గణనీయంగా పెరిగింది. అలాగే భక్తులకు ముందుగా చెల్లించిన డిపాజిట్ మొత్తాన్నితిరిగే చెల్లించలేదనే ఫిర్యాదుకు ప్రతిస్పందనగా..అందుకోసం ప్రత్యేక కౌంటర్ తెరవనున్నట్లు దేవస్వం బోర్డు అధ్యక్షుడు తెలిపారు. వద్ద రద్దీ కారణంగా చాలామంది ప్రజకలు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. కౌంటర్ ఆఫీసు పనిచేస్తుందని,భక్తుల మొత్తాన్ని తిరిగి అప్పగించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతానికి 500 గదులు ఉన్నాయన్నారు. సాఫ్టవేర్ కూడా మారనుంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో గది బుక్ చేసుకోవడానికి ముందస్తు డిపాజిట్లు చెల్లించన మొత్తం తిరిగి ఇవ్వబడుతుందని అన్నారు.ఆన్‌లైన్‌లో బుక్‌చేసిన మొత్తం తిరిగి ఖాతాలో జమ చేయబడుతుందని అన్నారు.

**యథావిధిగా నియంత్రణ**

ఒక వ్యక్తికి 20 టిన్లు ఇవ్వాలనే నిర్ణయం కొనసాగుతుందని రాష్ట్రపతి అన్నారు. ప్రతి ఒక్కరికీ రిజర్వేషన్లు కల్పించడానికి ఇలాంటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదప్రజలకు అసౌకర్యం కలిగించదని అన్నారు. మండల పూజ తరువాత, ప్లాంట్ 27 న మూసివేసి అనంతరం మూడు రోజుల తర్వాత తెరుస్తానమని అన్నారు. ఈ ఏడాది దాదాపు 45 లక్షల అరవణ నిల్వల సేకరణతో తీర్థయాత్ర సీజన్ ప్రారంభమైంది. కానీ అవన్నీ అనూహ్యంగా అమ్ముడయ్యాయని అన్నారు. రోజుకు 3.5 లక్షల మేర టిన్లను విక్రయించాలని అనుకున్నా.. సగటున్న నాలుగున్నర లక్షలు పైనే అమ్ముడయ్యాయని అన్నారు. ప్రస్తుతం. ఒక మిలియన్ కంటే ఎక్కువ టిన్లు నిల్వలు ఉన్నట్లు తెలిపారు.

## ఆ గ్రామ జనాభా 1,500..

## 3 నెలల్లో 27,000కుపైగా జననాలు!



**ముంబై:** ఆ గ్రామ జనాభా కేవలం 1,500. అయితే మూడు నెలల్లో 27,000కు పైగా జననాలు అక్కడ నమోదయ్యాయి. ఈ విషయం తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. అతిపెద్ద జనన ధృవీకరణ పత్రాల స్కామ్ జరిగినట్లు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అర్ని తహసీల్‌లోని షెందురుసాని గ్రామ పంచాయతీ జనాభా కేవలం 1,500. అయితే ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి నవంబర్ మధ్య కేవలం మూడు నెలల్లోనే 27,397 జననాలు ఆ గ్రామంలో నమోదయ్యాయి. కాగా, ఈ విషయం తెలిసి జిల్లా ఆరోగ్య అధికారులు షాక్ అయ్యారు. ఆ గ్రామాన్ని సందర్శించారు. అసాధారణ రీతిలో నమోదైన జననాల ధృవీకరణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో అతిపెద్ద జనన ధృవీకరణ పత్రాల స్కామ్ బయటపడింది. జనన, మరణ నమోదు వ్యవస్థ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు గుర్తించారు. గ్రామ పంచాయతీ సీఆర్ఎస్ లాగిన్ ఐడీ ముంబైకి మ్యాప్ అయ్యిందని తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. మరోవైపు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కూడా పంచాయతీ శాఖ డిప్యూటీ సీఈవో ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. మూడు నెలల్లో నమోదైన 27,397 జననాలు, ఏడు మరణాలు గ్రామ పంచాయతీ పరిధికి వెలుపల ఉన్నట్లు ఆ కమిటీ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆరోగ్య అధికారి ఈ స్కామ్‌పై యావత్మల్ నగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీజేపీ సీనియర్ నేత కిరీట్ సోమయ్య బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ నమోదైన జననాల్లో 99 శాతం పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులవేనని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తో మాట్లాడినట్లు చెప్పారు. ఈ జననాల నమోదులన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (జజుూా) కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

## బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం..

## భారత్‌కు పెనుముప్పు



బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద శిక్షణ శిబిరాలు వెలుస్తున్నాయని, అల్‌ఖైదాకు చెందిన వ్యక్తులు అక్కడ చురుగ్గా పనిచేస్తున్నారని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్ వాజేద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాలో ఇలాంటి ఉగ్రచర్యలు భారత్‌కు పెనుముప్పు అని ఆయన హెచ్చరించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం భారత్‌కు అత్యంత ప్రమాదకరం అని అన్నారు. ప్రజాస్వామ్యాలను అణగదొక్కేలా ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఇస్లామిక్ పార్టీలకు అధికారం కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఈ మార్పు భారత్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపనుందని తెలిపారు. లష్కరే తోయిబా కమాండర్లు బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడుతున్నారని వెల్లడించారు. ఇవన్నీ భారత్‌కు ముప్పేనని, ఇది వాస్తవమని వ్యాఖ్యానించారు. జమాతే ఇస్లామీ వంటి ఇతర ఇస్లామిక్ పార్టీలకు తాత్కాలిక ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. అలాంటి శక్తుల ప్రభావంతో బంగ్లాదేశ్‌లో అస్థిరత నెలకొందని అన్నారు. దేశంలోని సగం మంది ఓటర్లను తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేస్తోందని ఆరోపించారు. గతంలో ఇస్లామిక్ సంస్థలపై అవామీ లీగ్ పాలనలో విధించిన ఆంక్షలను యూనస్ ప్రభుత్వం సడలించిందని ఆయన అన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉన్న పాక్ వంటి దేశాలతో బంగ్లాదేశ్ తాత్కాలిక సర్కారు అంటకాగుతోందని విమర్శించారు. అవామీలీగ్ అధికారంలో ఉన్నప్పుడు భారత తూర్పు సరిహద్దులను ఉగ్రవాదుల నుంచి సురక్షితంగా ఉంచామని గుర్తు చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం తిరిగి రావాలని, ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కష్టకాలం ముగిసింది..

## అతిపెద్ద తుఫాను నుంచి బయటపడ్డాం



ఇండిగోలో తలెత్తిన సంక్షోభంపై ఆ సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ స్పందించారు. ఈ మేరకు ఉద్యోగులకు ఓ వీడియో సందేశాన్ని పంపారు. కష్టకాలం ముగిసిందని తెలిపారు. సంక్షోభం సమయంలో తమకు అండగా నిలిచిన సిబ్బందికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అంతేకాదు.. ఎయిర్‌లైన్ రోజువారీ సర్వీసులు పునరుద్ధరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 2,200 విమానాలను నడుపుతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమిష్టి కృషి, క్రమశిక్షణకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'కష్టకాలం ముగిసింది. అతిపెద్ద సవాలును అధిగమించాం. ఇండిగో ఉద్యోగులు, మేము ఒకరికొకరం మద్దతుగా నిలిచి ఈ తుఫాన్‌ను ఎదుర్కొన్నాం. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఓసీసీ, కస్టమర్ సర్వీస్ ఇలా మాకు మద్దతు ఇచ్చిన అన్ని విభాగాల ఉద్యోగులకు ధన్యవాదాలు' అని తెలిపారు. అంతేకాదు.. పలు కారణాలు ఒక్కసారిగా ముంచుకురావడంతో ఈ సమస్య తీవ్ర రూపం దాల్చినట్లు చెప్పారు. డిసెంబర్ 9నాటికి పరిస్థితులు చక్కబడతాయని ఉద్యోగులకు తెలియజేసినట్లు చెప్పారు. ఆ తర్వాత సంస్థ తన షెడ్యూల్‌ను పునర్నిర్మించుకుందని అన్నారు. సంస్థను మరింత దృఢంగా తీర్చిదిద్దడంతో పాటు సమస్యకు కారణాలు అన్వేషించడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. సమస్యకు మూల కారణాన్ని విశ్లేషించేందుకు విదేశీ నిపుణుడిని రంగంలోకి దింపిన విషయాన్ని కూడా సీఈఓ పీటర్ ఎల్బర్స్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి అంతరాయాలు ప్రపంచంలోని పెద్ద విమానయాన సంస్థలను కూడా ప్రభావితం చేసినట్లు గుర్తు చేశారు. ఇలాంటి కొన్ని సంక్షోభ పరిస్థితులు మన వ్యవస్థలను బలోపేతం చేయడానికి కూడా సాయపడతాయని అభిప్రాయపడ్డారు. సంక్షోభానికి గల కారణాలను విశ్లేషించి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకపై ఉద్యోగులు ప్రశాంతంగా ఉండాలని, వారు బాధ్యతలపై దృష్టిపెట్టాలని సూచించారు. 'సంస్థలో ప్రస్తుతం 65 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. సంస్థ ఇప్పటివరకు 850 మిలియన్లకు పైగా కస్టమర్లకు సేవలందించింది. దేశంలోని మారుమూల ప్రాంతాలను ప్రపంచానికి అనుసంధానిస్తూ అత్యంత భద్రతా ప్రమాణాలను పాటిస్తోంది. ఏ లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించామో.. ఆ విధంగానే భారత్‌లో సేవలందిస్తూనే ఉంటాము'

# కమలంలో లీక వీరులు ఎవరు?




**హైదరాబాద్ :** "మోదీతో విందులో జరిగిన చర్చల్ని బయటపెట్టిన వారెవరు?. మోదీ బయటకు చెప్పవద్దని చెప్పారు?. బయటకు చెప్పిన వారిపై చర్యలు తీసుకుంటాం".. అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో ఆవేశపడ్డారు. ఆయన అలా అన్నారు కానీ ఆ సమావేశంలో మోదీ ఎం చెప్పారో ఆయన కూడా ఈ మీడియా చిట్ చాట్ లో చెప్పారు. ఒడిషాలో బలమైన నేతలు లేరు కానీ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణ బీజేపీ రాను రాను కుంచించుకుపోతోంది. దానికి పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్న చోట ఆ పార్టీకి మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ తమ పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న చోట కూడా భారీ విజయాలు దక్కించుకోలేకపోతోంది. ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. వారంతా మంచి మెజార్టీలతో గెలిచారు. కానీ పంచాయతీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈటల రాజేందర్ మల్కాజిగిరి కన్నా హుజూరాబాద్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇతర ఎంపీలూ అంతే.ఎవరికి పదవి ఇస్తే ఎవరు అసంతృప్తికి గురవుతారోనన్న ఉద్దేశంతో అందర్నీసమానంగా ఉంచుతూ.. ప్రధాన పదవులకు పెద్దగా పోటీ పడని రామచంద్రరావును అధ్యక్షుడిగా నియమించారు. కానీ ఈ నియామకాన్ని బీజేపీ నేతలు వేరేగా తీసుకున్నారు. అసలు పని చేయడం మానేసారు. కొంత మంది అడ్వాంటేజ్ గా తీసుకున్నారు. తెలంగాణ బీజేపీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తో పాటు డీకే అరుణ, రఘునందన్ రావు లాంటి వాళ్లు ఉన్నారు. అందరూ ఎప్పుడూ ఒక్క మాట మీద లేరు. ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. వీరిలో ఎవరికైనా అధ్యక్ష పదవి వచ్చి ఉంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. ఇప్పుడు రామచంద్రరావు చెప్పిన మాట వినరు. పార్టీ తరపున పోరాటం చేయరు. దీంతో హైకమాండ్ రామచంద్రరావు నియామకంలో చేసిన ప్రయోగం రివర్స్ అయినట్లయింది.బండి సంజయ్ నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ పరిస్థితి మెరుగ్గానే ఉండేది. కానీ ఆయన ఎదుగుదల చాలా మందికి నచ్చలేదు. అందుకే నియంత్రించారు. చివరికి ఇప్పుడు అటూ ఇటూ కాకుండా అయిపోయింది. అటు ఈటలను ప్రోత్సహిస్తే బండి సంజయ్ ఒప్పుకోరు. బండి సంజయ్ ను ప్రోత్సహిస్తే ఈటల, కిషన్ రెడ్డి అంగీకరించరు. పార్టీ నేతల మధ్య ఏ మాత్రం సరిపడని ఈ రాజకీయాన్ని మోదీ ఎంతో కాలం సహించే అవకాశం లేదు. పార్టీ పరిస్థితి మెరుగుపడకపోతే ఆయన కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీ..**

మోదీతో తెలంగాణ ఎంపీల భేటీకి సంబంధించిన వివరాలు బయటకు రావడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. భేటీ వివరాలను లీకు చేసినోళ్లు మెంటల్‌గాళ్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ వివరాలను బయటకు చెప్పొద్దని స్వయంగా మోదీ ఆదేశించినా పట్టించుకోకపోవడం విచారకరం అంటూ మీడియాతో చిట్‌చాట్‌లో అన్నారు. లీకులు ఇచ్చిన ఎంపీలెవరో మీడియా ప్రతినిధులు చెప్తే.. వారిపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఐతే ఇక్కడే కొత్త చర్చ జరుగుతోంది. మోదీతో మీటింగ్ వివరాలు బయటపెట్టిన వాళ్లను మెంటల్‌గాళ్లు అంటూ కిషన్ రెడ్డి సంభోదించారంటే.. విషయం ఎంత సీరియస్సో.. జాతీయ నాయకత్వం ఎలాంటి తీరుతో ఉందో అర్థం అవుతుందనే చర్చ.. సొంత పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇదంతా ఎలా ఉన్నా.. మోదీ సమావేశ విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీగా మారింది. ప్రధానితో సమావేశం అయిన వారిలో.. తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ ఎంపీలు కూడా ఉన్నారు. ఇందులో సమావేశ వివరాలను బయటపెట్టాల్సిన అవసరం ఎవరికి ఉందన్న దానిపై ఆరా తీస్తున్నారని తెలుస్తోంది. కర్ణాటక, కేరళ ఎంపీలకు.. తెలుగు రాష్ట్రాల్లో మీడియా ప్రతినిధులతో పెద్దగా పరిచయం ఉండే అవకాశం లేదు. దీంతో తెలుగు రాష్ట్రాల ఎంపీలే.. ఈ విషయాలను బయటపెట్టి ఉంటారనే డిస్కషన్ నడుస్తోంది. దీంతో లీకు వీరుడు ఎవరనేది తెలుసుకునే ప్రయత్నంలో బీజేపీ నేతలు ఉన్నారట. మరి అది ఎవరో తెలిస్తే.. అసలు విషయం తేలితే.. ఎలాంటి చర్యలు ఉంటాయనేది హాట్‌టాపిక్‌గా మారింది.

# పరిషత్ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్




**హైదరాబాద్ :** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల పోరు ముగిసింది. మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ జరిగింది. చివరి విడత పోలింగ్ బుధవారం పూర్తయింది. అయితే, పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మూడు విడతల్లోనూ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా పోటీ చేసిన సర్పంచ్ లు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. అయితే, ఇదే ఊపులో జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలనుసైతం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మండల పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ (జడ్పీటీసీ) ఎన్నికలను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వ భావిస్తుంది. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వానికి చెప్పిందని సమాచారం. దీంతో ఈ నెలాఖరులో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు.. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందట. అన్నీ అనుకూలిస్తే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కంటే ముందే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వంలోని ముఖ్యులు పేర్కొంటున్నట్లు సమాచారం.పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని పల్లె ప్రజలు అధికార పార్టీ వైపే ఉన్నారని నిరూపించింది. ఇదే వేడిలో మున్సిపల్ ఎన్నికలను నిర్వహించి పట్టణ ప్రాంత ప్రజలుసైతం కాంగ్రెస్ ప్రభుత్వం వైపే ఉన్నారని స్పష్టం చేయాలని కాంగ్రెస్ పెద్దల ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్నీ కుదిరితే జనవరిలోనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, పార్టీ పరంగా జరిగే మున్సిపల్ ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.వాస్తవానికి పంచాయతీ ఎన్నికల్లోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేకంగా జీవో 9 జారీ చేసింది. అయితే, మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించరాదని, పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలను నిర్వహించుకోవచ్చునని కోర్టులు స్పష్టం చేశాయి. దీంతో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను నిలిపివేశాయి. మరోవైపు.. పంచాయతీలకు పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండానే పంచాయతీ ఎన్నికలకు వెళ్లింది. అయితే, మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.మున్సిపల్, పరిషత్ ఎన్నికలు పార్టీ గుర్తుపై నిర్వహించే ఎన్నికలు కావడంతో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో బీసీలకు పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే తొలుత మున్సిపల్, ఆ తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం జనవరి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

# మూడో డిస్కం రెడీ



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడానికి, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి మూడో డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న రెండు డిస్కంలపై భారాన్ని తగ్గించి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే దీని లక్ష్యం. ఈ కొత్త డిస్కం ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడంలో సహాయపడుతుంది. త్వరలోనే ఇది ఏర్పాటు కానుందని సమాచారం.తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు, నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ సర్కార్.. ప్రజల సంక్షేమం కోసం కూడా పలు పథకాలు ప్రారంభించింది. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తాజాగా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం తెలంగాణలో రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు ఉన్నాయి. వీటికి తోడుగా.. మూడో డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని అంటున్నారు.ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఈ 2 డిస్కంల పరిధి చాలా ఎక్కువగా ఉండటమే కాక.. విద్యుత్ డిమాండ్ కూడా భారీగా పెరగడం వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రస్తుతం టీఎస్ఎస్‌పీడీసీఎల్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ ద్వారా విద్యుత్ పంపిణీ జరుగుతోంది. త్వరలోనే వీటి సరసన మరో డిస్కం చేరనుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుతో పాటు.. వ్యవసాయం, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలను ప్రవేశపెట్టింది. వీటి వల్ల.. ప్రస్తుతం ఉన్న టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ డిస్కంలపై ఆర్థిక భారం పెరిగింది.దీన్ని తగ్గించడంతోపాటు.. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం కోసం మూడో డిస్కం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న సదరన్, నార్తర్న్ డిస్కంస్ తో పాటు త్వరలోనే ఏర్పాటు చేయబోతున్న ఈ కొత్త డిస్కం పనిచేయనుంది. మూడో డిస్కం ఏర్పాటు వల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక సమస్యలు తగ్గడమే కాక.. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం లభిస్తుందని అంటున్నారు.

## 2029లోనూ ఇవే..

## ఫలితాలు పునరావృతం

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీలో మూడు రోజులు చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ జలాల విషయంలో మాట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవడం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు సీఎం రేవంత్. 'కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాల పై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం.' అని రేవంత్ అన్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నిక పోరు ముగిసింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా చాటింది. పెద్ద సంఖ్యలో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. గురువారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముందుకు వచ్చారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలియజేయ డంతో పాటు.. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపైనా కీలక కామెంట్స్ చేశారు.

**కేటీఆర్ వచ్చాక బీఆర్ఎస్ గెలవలేదు..**

కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ గెలవలేదని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీష్ రావు వర్గం సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టిందని.. అందుకే ఆ విషయం చర్చకు రాకుండా కేటీఆర్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టారని అన్నారు. ఇదిలాఉంటే.. ఫార్ములా ఈ రేస్ కేసుపైనా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందన్నారు. అరవింద్ కుమార్‌కు సంబంధించి అనుమతి రావాల్సి ఉందన్నారు. డీవోపీటీ నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. మెస్సీ ఈవెంట్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం స్పష్టం చేశారు. మెస్సీ ఈవెంట్‌కు తాను గెస్ట్ మాత్రమేనని చెప్పారు. సింగరేణి యాజమాన్యం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చిందన్నారు. ఫుట్‌బాల్ ఆడించాలనే తన మనవడిని తీసుకెళ్లినట్లు సీఎం వివరించారు. తాము పబ్బులు, గబ్బుల చుట్టూ తిప్పలేదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. 12,702 పంచాయతీలకు 7,527 చోట్ల కాంగ్రెస్, 808 చోట్ల కాంగ్రెస్ రెబల్స్ గెలుపొందారని వెల్లడించారు. 66 శాతం ఫలితాలు కాంగ్రెస్, రెబల్స్ సాధించారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికల్లో ఒక కూటమిగా పోటీ చేస్తే, బీఆర్ఎస్ పార్టీకి 3,511, బీజేపీకి 710 స్థానాలు వచ్చాయని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించినట్లుగా అర్థమైందని అన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని అన్నారు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను తాము పాటిస్తామని, ప్రతిపక్షాలకు మాత్రం ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలు ఈ విజయానికి కారణమని అన్నారు.

## ఆర్థికంగా సంక్షోభంలో విద్యుత్ రంగం

-మొదటిపేజీ తరువాయి

వేలకోట్ల రూపాయల అప్పుల భారాన్ని మోయలేక నడ్డి విరుగుతోందని అన్నారు. విద్యుత్ సంస్థలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేసిందని.. రూ.30 వేల కోట్లకు పైగా అప్పు ఉందని చెప్పారని కేంద్రమంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కంపెనీకి 47 వేల కోట్ల రూపాయలు అప్పు ఉందన్నారు. విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోందని.. విద్యుత్ సంస్థల అప్పుల పరిస్థితి కూడా పెరుగుతోందని తెలిపారు. ఒకపూట వర్షాలు, గాలులు వస్తే హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోతుందన్నారు. కంపెనీలను ఆహ్వానిస్తున్న తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ లేకపోతే కంపెనీలు రావన్నారు. పాత బకాయిల విషయంలోనూ ఎటువంటి ఆలోచన చెయ్యడం లేదని విమర్శించారు. నిధులు లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. గ్లోబల్ హబ్‌గా మారాలంటే విద్యుత్ చాలా కీలకమని చెప్పుకొచ్చారు. కొత్త డిస్కంల ఏర్పాటుపై కాకుండా.. విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలన్నారు. మనిషి మనుగడ, వ్యవస్థ మనుగడకు విద్యుత్ అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. విద్యుత్ ప్రాథమిక అవసరంగా మారిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. 74 శాతం విద్యుత్ థర్మల్‌తోనే జరుగుతోందని అన్నారు. గతంలో ఏపీ, తెలంగాణలో విద్యుత్ కోతలు ఉండేవని గుర్తుచేశారు. మోదీ పీఎం కాకముందే విద్యుత్ కోసం ఆందోళనలు జరిగాయన్నారు. ఇపుడు 24/7 విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. ఇప్పుడు వన్ నేషన్ – వన్ గ్రిడ్‌తో అనుసంధానం జరిగిందని చెప్పారు. తెలంగాణలో విద్యుత్ కేబుల్స్ వ్యవస్థ బలోపేతం కోసం కొత్త టెక్నాలజీ అందించామన్నారు. కేంద్రం తెలంగాణాకు అనేక రకాలుగా సహకారం అందించిందని తెలిపారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల పవర్ జనరేషన్ చెయ్యాలని కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. సింగరేణి కంపెనీ డీఎమ్ఎఫ్ కింద నిధులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని కేంద్రమంత్రిపేర్కొన్నారు.

**ఎమ్మెల్యేల అనర్హత అంశంపై..**

ఎమ్మెల్యేల విషయంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయం దురదృష్టకరమని కేంద్రమంత్రి అన్నారు. ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ ఇచ్చిన తీర్పును పునరాలోచన చేయాలని కోరారు. పార్టీలు మారినట్టు ఎమ్మెల్యేలు, పత్రికలు ప్రకటించాయని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేశారన్నారు. రాజ్యాంగంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గౌరవం లేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే పని చేస్తోందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో గతం కంటే బీజేపీకి చాలా బలం పెరిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

## రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు

-మొదటిపేజీ తరువాయి

స్పీకర్ కు వినపడటం లేదట. పది మంది ఎమ్మెల్యేలు ఆడనా మగనా అని కూడా చెప్పుకోవడం లేదు. ఏ పార్టీనో చెప్పుకోవడం లేదు. 70 ఏళ్లు నిండిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి పార్టీ మారాల్సిన అవసరం ఏం వచ్చింది. అసెంబ్లీలో మొఖం చాటేస్తున్నారు. రేవంత్ రెడ్డి మూడు ఫీట్లున్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతాడు. అడ్డుమారి గుడ్డిదెబ్బలో రేవంత్ సీఎం అయిండు. కేసీఆర్ పై కాంగ్రెస్, బీజేపీ వాళ్లకు కూడా కోపం లేదు. జనవరిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడదాం. కేసీఆర్ హయాంలో కేంద్రం ఉత్తమ పంచాయతీల అవార్డులు ఇస్తే తెలంగాణకే 30 శాతం వచ్చాయి. రేవంత్ రెండుసార్లు రైతుబంధు ఎగ్గొట్టాడు. ప్రభుత్వాన్ని నడిపేందుకు రేవంత్ కు చేతకావడం లేదు. కరోన సమయంలో ఏ సంక్షేమ పథకం ఆగలేదు. కేసీఆర్ సీఎం అయ్యే నాటికి 72 వేల కోట్ల అప్పు ఉంది. పదేళ్ల తర్వాత రెండు లక్షల ఎనభై వేల కోట్లు అప్పు అయిందని కాగ్ చెప్తోంది.. కానీ కాంగ్రెస్ మంత్రులు మాత్రం ఆరేడు లక్షల కోట్ల అప్పు అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఏనాడు ఓట్ల కోసం కాంగ్రెస్ నేతల్లా కేసీఆర్ అబద్ధాలు చెప్పలేదు. బీఆర్ఎస్ గెలిచిన చోట్ల సంక్షేమ పథకాలు అమలు చేయమని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంటున్నారు.. అదేం రేవంత్ అత్త సొమ్ము కాదు.. రేవంత్ డబ్బులు ఇవ్వడం లేదని ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉత్తరం రాస్తున్నారు. ప్రతీ జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాం. సర్పంచులపై కేసులు వేసినా భయపడాల్సిన పరిస్థితి లేదు' అని విమర్శించారు.

## 'తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగింది'

-మొదటిపేజీ తరువాయి


బలంతో, అవినీతి, అరాచకంతో గెలిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ పథకాల పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయింది వారి అవినీతి గురించి వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో మినిస్టర్ పీఏలు తుపాకులు పెట్టి బెదిరిస్తున్నారు, రాజ్యాంగం మీద గౌరవం లేని వ్యక్తి రాహుల్ గాంధీ.

# బొగ్గు రవాణా రవాణా రక్షణ పాటించడంలోనూ కొండాపురం సిహెచ్ పి ఇతరులకు ఆదర్శంగా నిలవాలి

**ఏరియా జీఎం దుర్గం రాంచందర్**
**సింగరేణి 56వ రక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకుని సింగరేణి రైల్వే ట్రాక్ ను సందర్శించిన రక్షణ తనిఖీ బృందం**
**ఉద్యోగుల ఆధ్వర్యంలో రక్షణ సందేశాత్మక లఘు నాటిక ప్రదర్శన**
**అధికారుల ప్రశంసలతో పాటు బహుమతి అందుకున్న రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్**

**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** సింగరేణి 56వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా మణుగూరు ఏరియా కేసిహెచ్‌పిను సందర్శించిన రక్షణ తనిఖీ బృందం. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఏరియా జీఎం దుర్గం రామచందర్ మరియు విశిష్ట అతిధి రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ జి. కృష్ణమూర్తి, ఏరియా ఇంజినీర్, బెల్లంపల్లి పాల్గొన్నారు. బొగ్గు రవాణాతో పాటు రక్షణ పాటించడంలో కూడా కొండాపురం సిహెచ్ పి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. దసింగరేణి 56వ రక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకొని గురువారం నాడు ఏరియా కొండాపురం కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ లో జరిగిన సమావేశంలో ముఖ్య అతిధి ఏరియా జీఎం దుర్గం రామచందర్ హాజరైన కార్మికులు ఉద్దేశించి మాట్లాడారు... బొగ్గు రవాణా రక్షణ పాటించడంలో కూడా కొండాపురం సి హెచ్ పి రికార్డులు నెలకొల్పిందని అదే పరంపర కొనసాగిస్తూ ప్రమాద రహిత సింగరేణికై ప్రతి ఒక్కరు రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటుపడాలని ఆయన సూచించారు. రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ విశిష్ట అతిథి జి కృష్ణమూర్తి, ఏరియా ఇంజనీర్ బెల్లంపల్లి ఏరియా మాట్లాడుతూ తనకు మణుగూరుకు ఎంతో అనుబంధం ఉందని ప్రత్యేకించి కె సి హెచ్ పి లో పనిచేసిన అనుభవం ఉందని పని సంస్కృతి కలిగిన పర్మినెంట్ ఉద్యోగులు, వారికి ఎంతగానో సహకరించే కాంట్రాక్ట్ కార్మికులు,చక్కని పారిశ్రామిక సంబంధాలు కలిగిన నాయకులు వెరసి కొండాపురం సి.హెచ్.పి ప్రతిష్టను మరింత ఇనుమడింప చేస్తున్నారన్నారు. ప్రమాదరహిత సింగరేణికై ప్రతి ఒక్కరు స్వీయ రక్షణతో పాటు అనుక్షణం అప్రమత్తతో పని చేయాలని ఆయన పలు సూచనలు చేశారు. ఉద్యోగుల ప్రదర్శించిన రక్షణ సందేశాత్మక లఘు నాటికను రక్షణ తనిఖీ బృందంతో పాటు కార్మికులు అధికారులు తిలకించారు. వృత్తి నైపుణ్యత కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. అనంతరం బంకర్లను, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, రైల్వే లోడింగ్ సిస్టం కన్వేయర్ బెల్ట్ పనితీరు, రక్షణ పై కార్మికుల అవగాహన లైటింగ్ తదితర అంశాలను తనిఖీ చేశారు రక్షణ తనిఖీ బృందం సందర్శన సందర్భంగా కొండాపురం సిహెచ్ పి నీ సర్వాంగ సుందరంగా తీర్చించడంతోపాటు అధికారులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రక్షణ తనిఖీ బృందం మణుగూరు ఏరియా సింగరేణి రైల్వే ట్రాక్ సందర్శించారు. కొండాపురం సిహెచ్ పి అధికారుల నేతృత్వంలో సివిల్ అధికారుల పర్యవేక్షణలో దక్షిణ మధ్య రైల్వే కి అనుసంధానంగా మణుగూరు ఏరియా సింగరేణి రైల్వే ట్రాక్ నిర్వహణ చేపడుతున్న భద్రతా చర్యలు ప్రమాదాల నివారణకు కార్మికుల్లో యాజమాన్య కల్పిస్తున్న అవగాహనపై వారు నిశితంగా తనిఖీ చేశారు. స్వీయ రక్షణకు సంబంధించి కూడా కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు అలాగే రక్షణకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు ట్రాక్ నిర్వహణ పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు కాంట్రాక్ట్ కార్మికులను ప్రశంసిస్తూ ఒక బహుమతిని కూడా అందజేశారు కార్యక్రమంలో భాగంగా రక్షణ జెండాను ఆవిష్కరించారు, సామూహిక రక్షణ ప్రతిజ్ఞ చేపించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏరియా సేఫ్టీ ఆఫీసర్ డి.





వెంకట రామారావు, ప్రాజెక్టు అధికారి పికేఓసి ఎం. రమేష్, పిఓ ఎంఎన్‌జిఓసి ఈ. శ్రీనివాస్, ఏజెంట్ కొండాపురం వేణు మాధవ్, ఏజిఎం(ఐఈడి) సిహెచ్. రాంబాబు, డిజిఎం(పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్. రమేష్, ఇంచార్జ్ ఏరియా ఇంజినీర్ వీరభద్రుడు, డిజిఎం (ఈ అండ్ ఎం), కేసిహెచ్‌పి వి. మదన్ నాయక్, డిజిఎం(సివిల్) శివ ప్రసాద్, డిజిఎం (ఈ అండ్ ఎం), కేసిహెచ్‌పి ఆర్ఎస్ గౌడ, సందీప్ (సి ఎస్ పి), గుర్తింపు సంఘం నాయకుడు వై రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘ నాయకుడు వర్మ, రక్షణ తనిఖీ బృందం సభ్యులు సిహెచ్ గాబ్రియల్ రాజు, ఏ.జీ. శివప్రసాద్, బి. హనుమాన్ గౌడ్, బి. సంతోష్ కుమార్, ఏ. సంపత్, జి. శ్రీనివాస్, సేఫ్టీ అధికారి లింగ బాబు, డివై.ఎస్ఈ డి.వి.ఎస్.ఎన్ ప్రవీణ్, సూపర్వైజర్లు నవీన్, వత్సవాయి రవివర్మ, మేస్త్రిలు అంగోత్ మంగీలాల్, కుంటా రవి, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, సూపర్వైజర్లు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ తక్కళ్ళపల్లి రాజేందర్ సేవలు మరువలేనివి

**టిడబ్ల్యుఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేరీబాయి గణేష్, మైల సైదులు**
**జర్నలిస్ట్ తక్కళ్ళపల్లి రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించిన టిడబ్ల్యూజెఎఫ్**

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** తలకొండ పల్లి మండల సీనియర్ జర్నలిస్టు కీర్తిశేషులు తక్కళ్ళపల్లి రాజేందర్ కుటుంబాన్ని గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తక్కళ్ళపల్లి రాజేందర్ స్వగృహానికి వెళ్ళిన టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గణేష్ శేరీబాయి, మైల సైదులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా కేపీ, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహ రెడ్డి, షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, తలకొండపల్లి జర్నలిస్టులు శంకర్, తిరుపతయ్య, శ్రీను, అమన్ గల్ విలేకరి శేఖర్ తదితరులు రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తండ్రి కృష్ణయ్య,రాజేందర్ సతీమణి రమాదేవి, కూతురు జెస్సికా, కుమారులను వారు పరామర్శించారు. రాజేందర్ జర్నలిస్టు వృత్తిలో ఎంతో మెరుగైన పాత్ర పోషించారని ఈ సందర్భంగా ఆయన సేవలను టిడబ్ల్యూజేఎఫ్ కొనియాడింది. రాజేందర్ తెలంగాణ ఉద్యమంలో కూడా కీలక భూమిక అనేకమందికి తలలో నాలుకలా వ్యవహరించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజేందర్ కుటుంబానికి టిడబ్ల్యూజేఎఫ్ సంఘం అండగా నిలుస్తుందని తెలిపారు. విద్య, వైద్య తదితర విషయాలలో అతని కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుకు రావాల్సిన ప్రభుత్వం సంక్షేమ నిధి తదితర విషయాలలో ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించేందుకు కూడా




యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఎంతోమంది నాయకులతో ప్రజాప్రతినిధులతో రాజేందర్ కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా అత్యంత సన్నిహితంగా ఉండేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజేందర్ కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ తరఫున చెక్ ను అందజేశారు.

# జమ్మికుంట మడిపల్లి గ్రామపంచాయతీ

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** 21 ఏళ్లకే వార్డు మెంబర్‌గా ఘన విజయం సాధించిన తాళ్లపెల్లి ఆంజనేయులు యువతకు స్ఫూర్తిగా నిలిచిన మడిపల్లి 10వ వార్డు తీర్పు మడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 10వ వార్డులో జరిగిన ఎన్నికల్లో 21 ఏళ్ల వయసులోనే వార్డు మెంబర్‌గా ఘన విజయం సాధించిన తాళ్లపెల్లి ఆంజనేయులు గ్రామ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికారు. అతి చిన్న వయసులో ప్రజల విశ్వాసాన్ని సంపాదించి ఎన్నికల్లో గెలుపొందడం ద్వారా యువత కూడా ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టగలదని ఆయన నిరూపించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచే ప్రజల మధ్య ఉండుతూ, వార్డు సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, పరిష్కారాలపై స్పష్టమైన హామీలు ఇవ్వడంతో ఆంజనేయులుకు ప్రజల నుంచి విశేషమైన మద్దతు లభించింది. ముఖ్యంగా యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఆయనకు మద్దతుగా నిలవడం గెలుపులో కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా తాళ్లపెల్లి ఆంజనేయులు మాట్లాడుతూ, "నాపై నమ్మకం ఉంచి గెలిపించిన మడిపల్లి 10వ వార్డు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇది నా వ్యక్తిగత విజయం కాదు, యువత గెలుపు. వార్డు అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తాను" అని తెలిపారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, సంక్షేమ పథకాలు అర్హుల వరకు చేరేలా కృషి చేస్తానని, ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. తాళ్లపెల్లి ఆంజనేయులుకు వచ్చిన ఈ విజయం మడిపల్లి గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంచుతోంది. చిన్న వయసులోనే బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఎన్నికవడం భవిష్యత్‌లో గ్రామ అభివృద్ధికి మంచి ఫలితాలు తీసుకువస్తుందని గ్రామ పెద్దలు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మడిపల్లి 10వ వార్డు ప్రజలు



ఇచ్చిన తీర్పు యువతకు ఒక స్పష్టమైన సందేశం నాయకత్వానికి వయస్సు కాదు, నిబద్ధత ముఖ్యం.

# కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అన్నసమారాధన కార్యక్రమానికి కంబాల లక్ష రూపాయలు విరాళం

**సామాన్యుడి అస్త్రం కోరుకొండ :** గ్రామంలోని శ్రీ వల్లిదేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు పురస్కరించుకొని, ఈ నెల 23వ తేదీన అలయం వద్ద నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గారు లక్ష రూపాయలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు అచ్చారావు, మధు, శ్రీను, గణేష్, నాగు పాల్గొన్నారు...



# రాష్ట్రస్థాయికి సెలెక్ట్ అయిన బాక్సింగ్ విద్యార్థులకు అభినందించిన డాక్టర్ సుగుణాకర్ రాజు




**సామాన్యుడి అస్త్రం జనగామ** 19 నుండి 21 డిసెంబర్ 2025 న హైదరాబాద్ షేక్పేట్ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎలైట్ మెన్ అండ్ విమెన్ బాక్సింగ్ కాంపిటీషన్లో జనగామ జిల్లా బాక్సింగ్ విద్యార్థులు సెలెక్ట్ కావడం జరిగింది. బాక్సింగ్ కోచ్ అబ్బాస్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుండి వేరు తరువాత జనగామ జిల్లా ఏర్పడిన మొదటిసారిగా సీనియర్ బాక్సింగ్ కాంపిటీషన్ జనగామలో నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి జనగామ నుండి సెలెక్ట్ అయిన విద్యార్థులను శుభాకాంక్షలు తెలియజేస్తూ జనగామ జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా నిర్వహించుకొని ఇక్కడ నుండి రాష్ట్రస్థాయికి పోటీలకి వెళ్తున్న బాక్సింగ్ విద్యార్థులు మంచిగా పాల్గొని మెడల్స్ సాధించాలని వాళ్ల తల్లిదండ్రులకి, జనగామ జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. సెలెక్ట్ అయిన వివిధ కేటగిరిలో48 విభాగంలో సిహెచ్ అనూష 70 విభాగంలో బానోతు రుద్ర, 60 విభాగంలో టి.ప్రణయ్, 90 విభాగంలో బొజ్జం సాకేత్ కుమార్ సెలెక్ట్ కావడం జరిగిందని కోచ్ ఎండి అబ్బాస్ తెలియజేశారు మాకు మా పిల్లలకి సపోర్ట్ చేస్తున్నా మిత్రులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు

# బిజెపి కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**న్యాయమే గెలుస్తుందనీ ధీమా**
**శంషాబాద్ లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ధర్నా**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :**నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా రాహుల్ గాంధీలపై ఇడి ఛార్జిషీటు దాఖలు చేసిన కేసులో ఈ ఛార్జిషీటును ఢిల్లీ కోర్టు స్వీకరించడానికి నిరాకరించిందనీ ఈ విషయంపై షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ బీజేపీని తీవ్రంగా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని తమ పదవులకు రాజీనామా చేయాలని గురువారం ఆయన డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. 'గాంధీ కుటుంబాన్ని వేధించడమే నేషనల్ హెరాల్డ్ కేసు లక్ష్యం అని కేవలం రాజకీయ ప్రతీకార దృక్పథంతోనే దీనిని దాఖలు చేశారన్నారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయం నరేంద్ర మోడీ, అమిత్ షాలకు చెంపదెబ్బలాంటిదన్నారు. భవిష్యత్తులో ప్రజలను వేధించబోమని పేర్కొంటూ వారు రాజీనామా చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు.అలాగే నేషనల్ హెరాల్డ్ కేసు ఓ తప్పుడు కేసుగా ఎమ్మెల్యే శంకర్ అభివర్ణించారు. కేవలం రాజకీయ ప్రతీకారం, దురుద్దేశంతోనే ఈ కేసును కొనసాగించారని ఆయన ఆరోపించారు. 1938లో స్వాతంత్ర్య సమరయోధులు ఈ (నేషనల్ హెరాల్డ్) పత్రికను ప్రారంభించారనీ దీనిని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు మనీలాండరింగ్ వంటి విషయాలతో ముడిపెట్టి అప్రతిష్టపాల్జేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నిజం ఏమిటంటే ఈ కేసులో ఏమీ లేదనీ అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులను వేధించడమే, గాంధీ కుటుంబాన్ని అవమానించడమే బీజేపీ ఈ కేసును ఒక సమస్యగా మార్చడానికి ప్రయత్నిస్తోంది అని శంకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి ఈడి ద్వారా కేసుల్ని పెట్టిస్తుందనీ కానీ ఢిల్లీ కోర్టు తీసుకున్న నిర్ణయంతో 'తీర్పు న్యాయానికి అనుకూలంగా వచ్చిందన్నారు. సత్యం గెలిచిందనీ కోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ ధర్నాకు మాజీ పిప్పి శివశంకర్ గౌడ్, తదితర నియోజకవర్గ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# అశోక్ యాదవ్ ఘనవిజయం రాచపల్లిలో ప్రజల తీర్పు స్పష్టం



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** రాచపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అశోక్ యాదవ్ ఘన విజయం సాధించారు. గ్రామ ప్రజల సంపూర్ణ మద్దతుతో అశోక్ యాదవ్ సర్పంచ్‌గా ఎన్నికై, రాచపల్లిలో అభివృద్ధికి ప్రజలు ఇచ్చిన తీర్పును స్పష్టం చేశారు.దఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచే గ్రామ సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించిన అశోక్ యాదవ్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది. ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు ఆయనకు అండగా నిలిచారు. గ్రామంలో ప్రధానంగా ఎదురవుతున్న తాగునీటి కొరత, అంతర్గత రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపాలు వంటి అంశాలను ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించారు. గెలుపు సాధించిన వెంటనే ఈ సమస్యలపై తొలి ప్రాధాన్యతగా పనిచేస్తానని అశోక్ యాదవ్ హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో విద్యా, ఆరోగ్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచి, పారదర్శక పాలన అందిస్తానని తెలిపారు. అశోక్ యాదవ్ గెలుపుతో రాచపల్లి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. మద్దతుదారులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమైందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. గ్రామ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు తగ్గట్టుగా అశోక్ యాదవ్ పనిచేస్తారని విశ్వాసం వ్యక్తమవుతోంది. ఈ విజయం వ్యక్తిగత గెలుపు కాదని, రాచపల్లి గ్రామ సమిష్టి విజయమని ఆయన పేర్కొన్నారు

# దాలిగుమ్మడిలో విద్యాభివృద్ధికి కీలక అడుగు

**సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో రూ.13 లక్షలతో ఎంఫీపీ పాఠశాల నిర్మాణం ప్రారంభం స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి:** విద్యాభివృద్ధి దిశగా హుకుంపేట మండలంలోని హుకుంపేట పంచాయతీ పరిధిలోని దాలిగుమ్మడి గ్రామంలో మరో కీలక అడుగు పడింది. సమగ్ర శిక్ష అభియాన్ కేంద్ర ప్రభుత్వ పథకం కింద రూ.13 లక్షల వ్యయంతో మండల్ పరిషత్ ప్రైమరీ పాఠశాల (ఎంఫీపీ) భవన నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ మరియు ఎంపీటీసీ కొమ్మా రమ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణిమ మాట్లాడుతూ, పాఠశాల భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, అలాగే సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను కోరారు. గ్రామంలోని పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో, నూతన భవనం మంజూరు కోసం గతంలో అనేకమంది అధికారులను కలిసినట్లు సర్పంచ్ మరియు ఎంపీటీసీ గుర్తు చేశారు. తమ హయాంలోనే ఈ పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరవడం తమకు ఎంతో సంతోషం కలిగించిందని వారు తెలిపారు. ఈ కొత్త భవనం ద్వారా గ్రామ విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు లభించనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల అధ్యక్షులు పాంగి



అనిల్, ఉపాధ్యాయులు సుంక్రి బొంజన్న, కూడా శకుంతల, పాఠశాల చైర్మన్ సోవ్వేరి కృష్ణ కాంత్, కాంట్రాక్టర్ వంతాల రాజు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

## పులి మంజుల రాజు పెళ్లి రోజు సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ అధ్వర్యంలో మహా అన్న సమర్పణ కార్యక్రమం

**సామాన్యుడి అస్త్రం జనగామ** శ్రీ పులి మంజుల రాజు పెళ్లి రోజు సందర్భంగా జనగామ జిల్లా గవర్నమెంట్ ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి ఘనంగా పెళ్లి రోజు వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ ఈరోజు పెళ్లిరోజు వేడుకలు జరుపుకుంటున్న శ్రీ శ్రీమతి పులి మంజుల రాజు కి శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి ఒక్కరు సందర్భంగా భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా మీ మీ గ్రామస్థాయి పట్టణస్థాయిలో నిరుపేద కుటుంబాలకు నిరాశ్రయులకు అనాధలకు ఒక పూట ఆకలిని తీర్చి మానవత్వాన్ని చాటుకోవాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారు ఈ సేవా కార్యక్రమంలో చింతల మధు కృష్ణ, జనగామ అమ్మ




ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, మద్దెల కార్తీక్, బింగి నరసింహులు, ఎండి అప్రోచ్, ఎండి యాకూబ్, గోల్కొండ మహేష్, గోల్కొండ శ్రీను, పల్లె హరీష్, గుగులోత్ గణేష్, తదితరులు పాల్గొన్నారు

# జనగామ అమ్మ క్యాంటీన్

**సామాన్యుడి అస్త్రం జనగామ** కాసం చంద్రమౌళి జ్ఞాపకార్థం కూతుర్లు అల్లుళ్లు జి కరుణాకర్ మౌనిక సిహెచ్ రవిచంద్ర భవిత జనగామ మాతా శిశు ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మాతృమూర్తులకు మహా అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించి ఘనంగా తమ తండ్రిని మామ ని స్మరించుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో ఈరోజు మహా అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించిన కాసం చంద్రమౌళి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు



ప్రతి ఒక్కరు ఆకలితో ఉన్నవారికి నిరాశ్రయులకు అనాధలకు నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని సందర్భం ఏదైనా కానీ మీ గ్రామస్థాయి పట్టణస్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రజలు యువత ముందుకు కలిసి రావాలని పిలుపునిచ్చారు ఈ సేవా



కార్యక్రమంలో బుస్స సంపత్ జనగామ అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, మద్దెల కార్తీక్, బింగి నరసింహులు, ఎండి అప్రోచ్, ఎండి యాకూబ్, గోల్కొండ మహేష్, గోల్కొండ శ్రీను, పల్లె హరీష్, కోయాడ విశ్వ గుగులోత్ గణేష్, తదితరులు పాల్గొన్నారు

## జనగామ పట్టణంలోని 14వ వార్డు అంబేద్కర్ నగర్ లో పార్కులో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

**సామాన్యుడి అస్త్రం జనగామ** జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనగామ పట్టణంలోని 14 వ వార్డులో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది, మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమన్ని నిర్వహించడం జరిగింది జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ పార్కులో గతంలో జనగామ పట్టణ ప్రజలు, చిన్న పిల్లలు, మరియు వృద్ధులకు ఉపయోగపడకుండా చెట్లు పెరిగి చెత్త చెదరంతో కూడుకపోయి ఇప్పుడు ఉన్న యువత మద్యపానం, మరియు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తూ, చెట్లు పెరిగి పాములు కోతులు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా ఇట్టి విషయంపై జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ స్థానిక జనగామ మున్సిపల్ కమిషనర్,మరియు వారి యొక్క సిబ్బందితో, అలాగే జూనియర్ కళాశాల విద్యార్థులతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించి అటువంటి పరిస్థితుల్లో ఉన్న పార్కును పూర్తిగా శుభ్రం చేసి,ప్రజల నడక కోసం, ఉపయోగించుకునేలా వాక్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు పిల్లలు ఆనందంగా ఆడుకునేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ, ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో శుభ్రత, హరిత వాతావరణం యొక్క ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేయడానికి సహకరించిన జనగామ మున్సిపల్ కమిషనర్ శ్రీ మహేందర్ రెడ్డి కి, మరియు మున్సిపల్ సిబ్బంది, అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి కి, రవీందర్, శ్రీనివాస్, మరియు కాలేజ్ సిబ్బంది,కాలేజ్ పిల్లలకు, స్థానిక వార్డు మహిళలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను జీవన్ గ్రీన్







హోప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్

## వైష్ణవి స్కూల్ లో టైక్వాండో విద్యార్థులకు బెల్ట్ ప్రమోషన్ టెస్ట్

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగాం జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 18/12/2025/రోజున వైష్ణవి స్కూల్ లో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. విద్యార్థులు పాల్గొని పుంసే కొరిగిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బెల్టులందుకోవడం జరిగింది. వైష్ణవి స్కూల్ ప్రిన్సిపాల్ సురేందర్ నాథ్ మాట్లాడుతూ టైక్వాండో ప్రతి ఒక్క రూ నేర్చుకోవాలి ఈ రోజులలో ప్రతి విద్యార్థికి అవసరము సమాజంలో జరుగుతున్న అగత్యాలని అరికట్టడానికి ప్రతి ఒక్క అమ్మాయి లు టైక్వాండో నేర్చుకుంటే దృఢంగా మానసికంగా శారీరకంగా సమాజంలో ధైర్యంగా ఉండగలుగుతారు అని తెలియజేశారు. కోచ్ ఎండి అబ్బాస్, మెరుగు క్రాంతి, సిహెచ్ అనూష, తదితరులు పాల్గొన్నారు



## గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

**తిప్పారం గ్రామ సర్పంచ్ ఆకుల భద్రప్ప**



**సామాన్యుడి అస్త్రం సిద్దిపేట:** వీర శైవ లింగయత్ సంఘము ఆధ్వర్యంలో తిప్పరాం గ్రామ సర్పంచ్ గా గెలిచిన ఆకుల భద్రప్ప కి ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఆకుల భద్రప్ప మాట్లాడుతూ ముందుగా గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో సర్పంచ్ గా రెండుసార్లు పనిచేసిన అనుభవం ఉందని కాబట్టి గ్రామస్తులకు గ్రామంలో ఉన్న సమస్యను ప్రతి స్థాయిలో పరిష్కరిస్తానని గ్రామంలో ఉన్న గత సర్పంచ్ హయంలో జరగని అభివృద్ధి పనులన్నీ కూడా పూర్తి చేస్తానని నిన్నటి వరకు ఎన్నికల్లో పోటీ చేసిన ఓడినఅభ్యర్థులందరూ కూడా నాకు మిత్రులేనని అందరితో కలిసి మెలిసి పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో.ఉప సర్పంచ్. నవీన్. వార్డు మెంబర్లు. .రాజమణి. మల్లేశం. నాగరాజు. గ్రామస్థులు నాయకులు. ఈశ్వరప్ప. నాగప్ప. శంబయ .నవీన్.శేఖర్ అంజయ్య. శేఖర్. సాయి. .సిద్దిపేటజిల్లా వీర శైవ లింగాయత్. సంఘం. ప్రసిడెంట్. ఆకుల సాయి. బజారు. నాగప. గౌరైయ్య. శివలింగం. శ్రీనివాస్. సిద్ధి మల్లయ్య మరియు గ్రామస్తులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా నుండి టీఆర్పీ పార్టీలో భారీగా చేరికలు



**సామాన్యుడి అస్త్రం జనగామ** కదిలి వచ్చిన నారిమణులు బీసీ మహిళల రాజకీయ చైతన్యానికి నిదర్శనం ఈరోజు హైదరాబాద్ టీఆర్పీ పార్టీ కేంద్ర కార్యాలయంలో జనగామ జిల్లా టీఆర్పీ పార్టీ అధ్యక్షురాలు చెరుకూరి మౌనిక యాదవ్ రఘునాథ్‌పల్లి మండలం టీఆర్పీ ప్రెసిడెంట్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ కోలాటం మహిళా టీం సభ్యులు అందరూ తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నూతనంగా పార్టీలో చేరిన మహిళలకు కండువా కప్పి ఆహ్వానించారు అనంతరం మహిళా నాయకులు మాట్లాడుతూ మీరు ఇచ్చిన స్ఫూర్తితో మా మండలంలో కళాకారులంతా ఏకమై బీసీ బిడ్డలకే ఓటు వేసి గెలిపించుకున్నాం అని తెలిపారు ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ బీసీ సమాజంలో వస్తున్న చైతన్యం అద్భుతం మహిళలు ముందుకు వచ్చి ఉద్యమాన్ని నడిపిస్తుండటం తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం అని అన్నారు బీసీలకు రాజ్యాధికార దిశగా టీఆర్పీ పార్టీని ముందుకు అనునిత్యం కొనసాగించాలని నూతన కార్యకర్తలకు పిలుపు నిచ్చారు నూతనంగా పార్టీలోకి చేరినవారు చిలివేరి రాజు యాదవ్, శంకరి రాజ్ గౌడ్, అరుణ, నవ్య, కల, పూలమ్మ, సరిత,లక్ష్మి, ఉమా, రజిత, కల, రేణుక, రజిత, యాకమ్మ, మనోర, టీఆర్పీ పార్టీ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్ జనగామ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే ను కలిసిన బూర్గుల వార్డ్ సభ్యులు..

**గ్రామ అభివృద్ధికి తోడ్పాడాలంటూ విన్నపం..**

**మర్యాద పూర్వకంగా కలిసిన వార్డ్ సభ్యులను ఘనంగా సన్మానిస్తూ అండగా ఉంటానని ఎమ్మెల్యే వీర్లపల్లి భరోసా..**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** పల్లెపోరులో వార్డు సభ్యులుగా తమ అదృష్టన్ని పరీక్షించుకునేందుకు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గ్రామస్థుల ఆశీర్వాదంతో విజయం సాధించారు.ఎన్నికల వేళా గ్రామస్థులకు ఇచ్చిన హామీల్లో భాగంగా అధికార పార్టీతోనే అభివృద్ధి పరుగులు పెడుతుందని సంక్షేమ ఫలాలు అందించేందుకు తోడ్పాటు దక్కుతుందనే విశ్వాసంతోనే స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు బూర్గుల వార్డ్ సభ్యులు..ఇదే క్రమంలో వార్డ్ సభ్యులను కలుసుకున్న ఎమ్మెల్యే ఎన్నికల కురుక్షేత్రంలో విజయం సాధించిన వార్డ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులుగా ఏంతో బాధ్యతయుతంగా మసులుకోవాలని గ్రామస్థులు కట్టబెట్టిన పదవికి వన్నె తెచ్చేల నడుచుకోవాలని పార్టీలు మారుతూ ప్రజల్లో చులకన కాకూడదని తనపై నమ్మకంతో తనను నమ్మివచ్చిన ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా అండగా ఉంటానని రబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, స్థానల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునే దిశగా తమ ప్రయత్నాలను ముమ్మరం చేయాలనీ తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న గ్యారంటీలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు క్లుప్తంగా వివరించాలని ఆ దిశగా ప్రతిఒక్క వార్డ్ సభ్యులు కృషి చేయాలనీ కోరారు..ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు కవిత పరుశురాం, సత్యం, మాజీ వార్డ్ సభ్యులు మర్గాని మాధవి రాజు గౌడ్, కాంగ్రెస్ యూత్ ప్రసిడెంట్ రాజు గౌడ్, యాదయ్య, మహిపాల్, కృష్ణ, గిరి,తదితరులు పాల్గొన్నారు..




# కార్మికుల భద్రత మరిచిన క్యాండూర్ సంస్థ

## కార్మికుల నివాసలలో భారీ పేలుళ్ళు

**5 వంట సిలిండర్స్ పేలి 35 గుడిసెలు దగ్ధ**

**ఎలాంటి చర్యలు తీసుకోని స్థానిక పోలీసులు**

**లేబర్ డిపార్ట్‌మెంట్ నిద్రలోనేనా?**



అస్త్రం, చందానగర్, నిఘావిభాగం


చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగంపల్లిలో మరోసారి నిర్మాణ కార్మికుల ప్రాణ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. క్యాండూర్ భారీ బహుళ అంతస్థుల భవన నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికుల నివాసాలైన లేబర్ షెడ్లలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో మొదలైన మంటలు క్షణాల్లోనే తీవ్రరూపం దాల్చి, షెడ్లలో ఉన్న వంట గ్యాస్ సిలిండర్లు వరుసగా పేలాయి. ప్రమాద సమయంలో ఎక్కువ మంది కార్మికులు పనుల్లో ఉండటంతో పెను ప్రాణ నష్టం తప్పింది. అయితే కార్మికుల దుస్తులు, వంట సామాగ్రి, వ్యక్తిగత వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న మాదాపూర్, పటాన్‌చెరు ఫైర్ సిబ్బంది మూడు గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఈ ఘటనపై కార్మిక సంఘాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. శేరిలింగంపల్లిలో 55 అంతస్థుల భారీ నిర్మాణం చేపట్టిన క్యాండూర్ నిర్మాణ సంస్థ, లేబర్ చట్టాలను బహిరంగంగా ఉల్లంఘించిందని పేర్కొన్నాయి. లేబర్ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండానే రేకుల షెడ్లలో వందల మంది కార్మికులను కుక్కిపెట్టి ఉంచారని ఆరోపించాయి. అగ్నిమాపక, భద్రతా నిబంధనలు ఏమాత్రం పాటించలేదని స్పష్టం చేశాయి.

ఇంత తీవ్ర ఘటన జరిగినా లేబర్ డిపార్ట్‌మెంట్, స్థానిక పోలీసులు కేసు నమోదు చేయడంలో ఆలస్యం చేయడం అనుమానాలకు దారితీస్తోందని సంఘాల నేతలు అంటున్నారు. గతంలో ఇదే నిర్మాణ సంస్థలో 30వ అంతస్థు నుంచి కార్మికుడు పడి మృతి చెందినా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హమని గుర్తు చేశారు.

ఇటీవల చందానగర్ పరిధిలో మరో భారీ నిర్మాణ సంస్థలోనూ సిలిండర్లు పేలి అగ్నిప్రమాదం జరిగినా, లేబర్ శాఖ తనిఖీలు ఎందుకు చేయలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారుల నిర్లక్ష్యం వల్లే కార్మికులు ప్రాణాలతో చెల్లించాల్సి వస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. భారీ నిర్మాణ సంస్థలపై పోలీసులు, లేబర్ డిపార్ట్‌మెంట్ మౌనం వెనుక ఆర్థిక లావాదేవీలున్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనలను కేవలం ప్రమాదాలుగా కొట్టిపారేయకుండా, క్రిమినల్ నిర్లక్ష్యంగా పరిగణించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ ఘటనపై లేబర్ డిపార్ట్‌మెంట్, అగ్నిమాపక శాఖ, పోలీసులతో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి, బాధ్యులైన నిర్మాణ సంస్థ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.





# రాచపల్లిలో బీఆర్ఎస్ జైత్రయాత్ర

**అశోక్ ఘనవిజయం కాంగ్రెస్, బీజేపీలకు భారీ ఎదురుదెబ్బ**

**యంగ్ లీడర్ అరెల్లి రమేష్ వ్యూహమే గెలుపుకు మూలం**

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** రాచపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తన రాజకీయ బలాన్ని మరోసారి చాటింది. పార్టీ బలపరిచిన అభ్యర్థి అశోక్ ఊహకందని మెజారిటీతో ఘన విజయం సాధించి రాచపల్లిలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈ ఫలితం కాంగ్రెస్‌కు మాత్రమే కాకుండా బీజేపీకి కూడా భారీ ఎదురుదెబ్బగా మారింది. ఎన్నికల ప్రచారం మొదలుకొని పోలింగ్ ముగిసే వరకూ పక్కా వ్యూహంతో వ్యవహరించిన బీఆర్ఎస్ యంగ్ లీడర్ అరెల్లి రమేష్ ఈ విజయంలో కీలక భూమిక పోషించారు. గ్రామస్థాయిలో ఇంటింటి ప్రచారం, యువతను చైతన్యపరచడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం వంటి అంశాల్లో రమేష్ మరియు ఆయన అనుచర బృందం చురుకుగా పనిచేశారు. దీని ఫలితంగా ప్రత్యర్థి పార్టీలకు ఊహించని రీతిలో ఓటింగ్ జరిగి, ఇద్దరు అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. కాంగ్రెస్‌ను రాజకీయంగా పూర్తిగా వెనక్కి నెట్టడంలోనూ, బీజేపీని కోలుకోలేని స్థితిలోకి నెట్టడంలోనూ బీఆర్ఎస్ వ్యూహం ఫలించిందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అశోక్ గెలుపు వెనుక కేవలం పార్టీ బలం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయి నాయకత్వం, ప్రజలతో నేరుగా మమేకమయ్యే విధానం ప్రధాన కారణాలుగా నిలిచాయి. ముఖ్యంగా యువత, మహిళలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపడం ఫలితంపై కీలక ప్రభావం చూపింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన రాచపల్లి ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని, అందరి సహకారంతో రాచపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. అరెల్లి రమేష్ కూడా మాట్లాడుతూ, పార్టీపై విశ్వాసం ఉంచి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో మరింత బలంగా ప్రజల మధ్య ఉండి పనిచేస్తామని అన్నారు. రాచపల్లి ఎన్నికల ఫలితం ఇల్లందకుంట మండల రాజకీయాల్లో కీలక మలుపుగా మారిందని, రాబోయే ఎన్నికలకు ఇది దిశానిర్దేశకంగా నిలుస్తుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# హుజూరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ హవా

**సామాన్యుడి అస్రం కమలాపూర్:** ఈటల చరిస్మా తో బీజేపీకి మెజారిటీ సర్పంచ్ స్థానాలు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో బిజెపి తన సత్తాను చాటుకుందని,మెజార్టీ సర్పంచ్ స్థానాలు సాధించి మరోసారి బిజెపికి తిరుగు లేదని నిరూపించుకుందని బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్ లు అన్నారు. జమ్మికుంట లో బీజేపీ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సర్పంచ్ అధ్యర్థులు పెద్దఎత్తున ఘన విజయం సాధించారని,కొన్ని గ్రామాల్లో బీజేపీ మద్దతుతో కూడా సర్పంచులు గెలిచారని వారు తెలిపారు. ముఖ్యంగా ఈటల రాజేందర్ కు హుజూరాబాద్ నియోజకవర్గంతో ఉన్న అనుబంధంతో ఆయన సపోర్ట్ చేసిన అభ్యర్థులను ప్రజలు అధిక స్థానాల్లో గెలిపించి ఆశీర్వదించారని, హుజూరాబాద్ నియోజకవర్గం ప్రజలు ఎల్లప్పుడూ ఈటల రాజేందర్ గారికి అండగా, బీజేపి వైపు వుంటారనడానికి సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన తీర్పే నిదర్శనం అని బీజేపీ నాయకులు తెలిపారు. ఈటల రాజేందర్ పైన హుజూరాబాద్ నియోజక వర్గ ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గెలిచిన సర్పంచులు గొప్పగా పనిచేయాలని వారు కోరారు. ప్రతిపక్ష పార్టీలు పనికట్టుకుని ఈటల రాజేందర్ పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇవి ఎక్కువ రోజులు నడవవని వీటిని ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. కొన్ని పత్రికలు, పెడ్ సోషల్ మీడియా సంస్థలు పని కట్టుకుని ఈటల రాజేందర్ పైన విష ప్రచారాలు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని, వాస్తవాలు తెలుసుకొని రాయాలని, అప్పుడే పత్రికల పట్ల ప్రజలకు విశ్వాసం కలుగుతుందని బీజేపీ నాయకులు సూచించారు. హుజూరాబాద్ నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామంలో విధులు నిర్వర్తించడానికి వచ్చిన చిగురుమామిడి స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ తన విధులను మరిచి అక్కడ సర్పంచ్ గా పోటీ చేసిన ఒక అభ్యర్థికి మద్దతుగా వారి ఇంటికి వెళ్లి బయటకు వచ్చిన తర్వాత ఆ పోలీస్ అధికారి బిజెపి బలపరిచిన అభ్యర్థి రాములు ఇంటి దగ్గర పోలీస్ ఫోర్స్ పెట్టి మా అభ్యర్థిని బయటకు రాకుండా అడ్డుకున్నాడని గౌతమ్ రెడ్డి ఆరోపించాడు. వెంటనే దీనిపైన పోలీస్ అధికారులు విచారణ జరిపి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విలేకరుల



సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ రావు, హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, కమలాపుర్ సర్పంచ్ పబ్బు సతీష్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్,బీజేపీ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు జీడి మల్లేష్, మహిళా మోర్చా నాయకురాలు రమా రెడ్డి, ఇటుకాల స్వరూప, శనిగరం సర్పంచ్ కొత్తపల్లి రాజు, గుండేడు సర్పంచ్ మేకల సుజాత రవి, భీంపల్లి ఉప సర్పంచ్ మునిగే రాజు, మౌటం వెంకటేష్ కొమ్ము అశోక్,పల్లపు రవి,మోతే స్వామి, రవిచెందర్ రెడ్డి,మోడెమ్ రాజు, ఉడుగుల రవి, ఉడుగుల మహేందర్, కొండపర్తి ప్రవీణ్ బొజ్జ శరత్, గోవింద రెడ్డి, పోడేటి అనిల్ పసునుటి శివ, బల్సుకూరి సురేష్, గుర్రపు పరశురామ్, నాగపూరి విజయ్, సమ్మిరెడ్డి, లల్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కెసిఆర్ మరియు కౌశిక్ రెడ్డి ప్రభంజనం

**సామాన్యుడి అస్రం కమలాపూర్ :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో కెసిఆర్ మరియు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభంజనం సృష్టించారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని బి.ఆర్.ఎస్ అభ్యర్థుల విజయంలో తనదైన పాత్ర పోషించి సంచలనం రేపారు. అధికార పార్టీ కాంగ్రెస్ ను కంగు తినిపించి హుజురాబాద్ నియోజకవర్గం తన కంచుకోటగా మరోమారు నిరూపించుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. ఇక్కడ తనకు తిరుగేలేదని గట్టిగా చాటి చెప్పారు. తాజా ఫలితాలతో విమర్శకుల నోరు మూయించి వారి గూబ గుయ్యిమనిపించారు. ఎన్నికలు ఏవైనా హుజురాబాద్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే అని, నియోజకవర్గ ప్రజల గుండెల్లో తానే ఉన్నాననే ఆత్మ విశ్వాసాన్ని కౌశిక్ రెడ్డి వెలిబుచ్చారు.

1. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం లో పంచాయతీ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. తనదైన వ్యూహంతో పావులు కదిపిన కౌశిక్ రెడ్డి హుజురాబాద్ మండలంలో7 .జమ్మికుంట మండలంలో 9, వీణవంక మండలంలో 12, కమలాపూర్ మండలంలో 11, ఇల్లంతకుంట మండలంలో 5 గ్రామపంచాయతీలను దక్కించుకున్నారు. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని తన నాయకత్వ పటిమను, సమర్థతను నిరూపించుకున్నారు.




2. పంచాయతీ ఎన్నికల్లో బి.జె.పి ప్రాబల్యం ఏమాత్రం కనిపించలేదు. ఎం.పి. ఈటల రాజేందర్ పరోక్షంగా వ్యవహారం నడిపించినా.. ఓటర్లు కౌశిక్ రెడ్డికే అండగా నిలిచారు. ఫలితంగా నియోజకవర్గంలో బి.జె.పి. నామమాత్రపు స్థానాలకే పరిమితం అవడమే కాకుండా.. ఇక్కడ ఈటల రాజేందర్ ఉనికి భూస్థాపితం అయినట్లు తేటతెల్లమైంది.

3. హుజూరాబాద్ నియోజకవర్గంలో వర్గ పోరుతో కుదేలవుతున్న కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో చావు దెబ్బతింది. కుమ్ములాటలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. ఈ నిజాన్ని గుర్తించిన నియోజకవర్గ ప్రజలు కౌశిక్ రెడ్డిపై విశ్వాసం ప్రదర్శించారు. ఆయన వెంటే ఉన్నామంటూ అత్యధిక స్థానాల్లో గులాబీ జెండాను రెపరెపలాడించారు.

4. కౌశిక్ రెడ్డికి దూకుడు స్వభావం ఉన్నా.. మనసు మాత్రం వెన్నపూస అనేది జగమెరిగిన సత్యం. రాజకీయాల్లో ఆయన దూకుడు ప్రదర్శించినా.. ప్రజలకు సేవ అందించడంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తారు. నియోజకవర్గంలో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకుంటారు. ప్రజా సమస్యలపై తక్షణం స్పందిస్తారు. ఆపన్నులను ఆదుకోవడంలో ఆయనకు సాటి ఎవరూ రారు. ఈ గుణమే కౌశిక్ రెడ్డిని తిరుగులేని నేతగా నిలబెట్టింది. మనసున్న మారాజు గా జనం గుండెల్లో కొలువు తీర్చింది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆయన సాధించిన ఫలితాలే దీనికి నిలువెత్తు నిదర్శనం.

## నేషనల్ హెరాల్డ్ కేసు - నిరసన కార్యక్రమంలో ఝాన్సీ రాణి,

**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు శ్రీమతి సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై బీజేపీ మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా, అక్రమంగా నమోదు చేసిన నేషనల్ హెరాల్డ్ కేసును ఢిల్లీ కోర్టు కొట్టి వేసిన సందర్భంగా, ఆ కేసు వెనుక ఉన్న నిజాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో హనుమకొండ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీని అడ్డుకున్న సుబేదారి పోలీసులు, ఝాన్సీ రాణిని అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.






అనంతరం ఝాన్సీ రాణి మాట్లాడుతూ, "సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను మోదీ ప్రభుత్వం జేబు సంస్థలుగా మార్చుకుని రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయిస్తోంది. నేషనల్ హెరాల్డ్ కేసును ఢిల్లీ కోర్టు కొట్టివేయడం ద్వారా ఈ ప్రభుత్వం పతనానికి నాంది పడింది" అని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వ అక్రమ చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## ఇల్లందకుంటలో దార సురేష్ ఘన విజయం

**660 ఓట్ల భారీ మెజారిటీతో రికార్డు గెలుపు**



**సామాన్యుడి అస్త్రం ఇల్లంతకుంట :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన దార సురేష్ రికార్డు స్థాయి మెజారిటీతో ఘన విజయం సాధించారు. మొత్తం 660 ఓట్ల భారీ ఆధిక్యంతో ప్రత్యర్థులను మట్టికరిపించి గ్రామ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఈ ఎన్నికల్లో దార సురేష్‌కు 1561 ఓట్లు లభించగా, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన మారపెల్లి సృజన్ బాబుకు కేవలం 900 ఓట్లు మాత్రమే దక్కాయి. గ్రామాభివృద్ధే ధ్యేయంగా చేపట్టిన ప్రచారం, ప్రజలతో నేరుగా మమేకమై చేసిన సేవా కార్యక్రమాలు దార సురేష్ విజయంలో కీలక పాత్ర పోషించాయని గ్రామస్తులు వెల్లడించారు. పార్టీ రాజకీయాలకు అతీతంగా ప్రజల విశ్వాసాన్ని పొందడమే ఈ స్థాయి మెజారిటీకి కారణమని వారు అభిప్రాయపడ్డారు. విజయం ఖరారైన అనంతరం గ్రామంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. అభిమానులు, మద్దతుదారులు బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## హుజురాబాద్ లో అంబరాన్ని అంటిన ఐక్య క్రిస్మస్ సంబరాలు





**సామాన్యుడి అస్రం కమలాపూర్ :** హుజురాబాద్ మండల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు హుజురాబాద్ పట్టణంలోని సాయి రూప ఫంక్షన్ హాల్ బుధవారం సాయంత్రం భక్తిభావంతో మారుమోగింది. హుజురాబాద్ మండల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్య క్రిస్మస్ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు హుజురాబాద్ నియోజకవర్గంలోని వివిధ సంఘాలకు చెందిన క్రైస్తవులు, కుటుంబ సమేతంగా భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దైవజనుల సందేశం ఈ కార్యక్రమంలో ప్రముఖ దైవజనులు పురుషోత్తం, ఫ్రాన్సిస్ గారు వాక్య సందేశం వినిపిస్తూ.. యేసుక్రీస్తు ఈ లోకానికి వెలుగుగా వచ్చారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆ వెలుగులో నడుస్తూ, సమాజాన్ని దైవ ప్రేమతో ప్రకాశింపజేయాలని కోరారు. ప్రభువు అనుగ్రహించే శాంతి, సమాధానాలతో ప్రజలందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులు, దైవజనులు కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల అనంతరం భక్తులందరికీ ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యుల పర్యవేక్షణ ఈ కార్యక్రమ నిర్వహణలో క్రింద పేర్కొన్న కమిటీ సభ్యులు ప్రత్యేక బాధ్యత వహించి విజయవంతం చేశారు: లి అధ్యక్షుడు: ఫాదర్ జి. నవీన్ కుమార్ ప్రధాన కార్యదర్శి: రెవరెండ్ ఎం. ప్రకాష్ కోశాధికారి: పాస్టర్ కె. రాజు ప్రతి సంవత్సరం మాదిరిగానే సీనియర్ పాస్టర్ దూడపాక జాన్ ప్రేమలత ను ప్రత్యేకముగా సన్మానించారు ఈ వేడుకల్లో దైవజనులు దేవదాస్, రాజకుమార్, గంగరాజు, ఇమ్మానియేల్, జాన్, ఉదయ్ కుమార్, దావీదు, జాషువా, బాలస్వామి, తిమోతి, సంజీవ్, జాన్ ప్రభాకర్, రత్నం బాబు, రవీందర్, జెకార్య, ప్రభాకర్, సుకుమార్, ప్రమోద్, ప్రవీణ్, సురేందర్ తదితరులు దైవజనులు విశ్వాసులు పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న కంబాల

**అన్నసంతర్పణ కార్యక్రమానికి 500 కిలోల బియ్యం విరాళం**





**సామాన్యుడి అస్త్రం గోకవరం : :** కోరుకొండ గ్రామం బజారు సెంటర్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం నిర్వహించిన, అన్న సంతర్పణ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలిత ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీన్మార్ డప్పులతో, పూలు జల్లుతూ, స్వాగతం పలికి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అలయంలో స్వామివారిని దర్శించుకుని, పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నసంతర్పణ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు 500 కిలోలు బియ్యాన్ని విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకొండ తన సొంత గ్రామం లాంటిదని, ఇక్కడ ప్రజలకు ఏ అవసరం వచ్చిన, సహాయం చేయడానికి తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ధర్మ పరిరక్షణకు హిందువులందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. ఇతర దేశస్తులు మన దేశంలో చొరబడి, అన్నతమ్ముల్లాగా కలిసి ఉంటున్న, మన మధ్య చిచ్చు పెట్టి విడదీయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, అటువంటి చర్యలను గ్రహించి, మనమందరం బలంగా నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పే దమ్ము ఉందా..?

**స్పీకర్ తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం**
**భారాసలో ఉన్నట్లుగా చెప్పుకొని ప్రజలను మోసం చేయడం అన్యాయం**
**అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరింది నిజామా..? కాదా..?**
**పార్టీలు మారే ఊసరవెల్లుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి**
**వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ప్రజా పోరాటాలు చేస్తాం**



**అస్త్రం, శేరిలింగంపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వంపై శేరిలింగంపల్లి యువ నేత, భారాస సీనియర్ లీడర్ రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగంను పట్టుకొని తిరుగుతారని, రాజ్యాంగ స్ఫూర్తి అని చెబుతారని, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం ద్వంద నీతికి పరాకాష్ట అన్నారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ లపై స్పీకర్ తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం స్థానిక నేతలతో కలిసి సమావేశం అయ్యారు. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై పోరాడుతామన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారారని రాష్ట్రంలోని ఏ ఒక్కరిని అడిగినా చెబుతారన్నారు. శేరిలింగంపల్లిలో భారాస నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరింది వాస్తవం కాదా..? అని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ప్రశ్నించారు. దమ్ముంటే ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలని సవాల్ చేశారు. భారాసలో ఉన్నట్లుగా చెప్పుకునే ధైర్యం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఉందా..? అని మండిపడ్డారు. ప్రజలు పిచ్చోళ్లు కాదని, అన్ని గమనిస్తున్నారని వెల్లడించారు. శేరిలింగంపల్లిలో అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరింది నిజామా..? కాదా..? చెప్పాలన్నారు. పార్టీలు మారే ఊసరవెల్లుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రవీందర్ యాదవ్ సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజా పోరాటాలు చేస్తామని, రానుంది భారాస ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి మాజి ప్రధానకార్యదర్శి గంగారాం సంగరెడ్డి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ బి సి నాయకులు ముద్దంగుల మల్లేష్ యువజన నాయకులు గణేష్ రెడ్డి విద్యార్థి నాయకులు రాజు యామలవలస, వసంత్ నాయుడు, నవీన్ రెడ్డి,పవన్ యాదవ్, కోటేష్,జస్వంత్, వరుణ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మియాపూర్ డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి

**అస్త్రం, మియాపూర్**



మియాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ సాయి ఎనక్లేవ్ కాలనీలో రూ.45.00 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన పార్క్ అభివృద్ధి పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి, కాలనీవాసుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, కృష్ణ సాయి ఎనక్లేవ్ కాలనీలో చేపట్టిన పార్క్ అభివృద్ధి పనులలో భాగంగా పార్కు చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆటవస్తువులు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని తెలిపారు. పార్క్ అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే, కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, మంజీర తాగునీటి వసతులను మరింత మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. కాలనీలో అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడమే తమ లక్ష్యమని, మియాపూర్ డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ శ్రీకాంత్ గారు కోరారు. మెరుగైన ప్రజాజీవనానికి అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అన్వర్, కృష్ణ సాయి ఎనక్లేవ్ కాలనీవాసులు విజయ్ కుమార్, వీరేందర్, కృష్ణచారి, సోమిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చందానగర్ సర్కిల్ కార్యాలయంలో డీసీ సమావేశం




**అస్త్రం, చందానగర్:** శేరిలింగంపల్లిలోని చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ శశిరేఖ అధికారులతో విస్తృతంగా సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఏఎంసీలు, టీఐలు, బీసీలు సహా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లను వేగవంతం చేయాలని ఉప కమిషనర్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే వసూలు చేసి ప్రభుత్వానికి ఆదాయం పెంచాలని సూచించారు. టీజీఎస్‌పీడీసీఎల్ పునశ్చరణ పనులను త్వరగా పూర్తి చేయాలని, విద్యుత్ శాఖతో సమన్వయం పెంచుకోవాలని తెలిపారు. జీఐఎస్ సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించి డేటాను నవీకరించాలని, మార్పులు అవసరమైన చోట వెంటనే సరిదిద్దాలని సూచించారు. మీ సేవ ద్వారా వచ్చే దరఖాస్తులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. అలాగే ఐజీఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తుల్లో డోర్ నంబర్లు తప్పనిసరిగా జోడించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి దరఖాస్తుపై బాధ్యతతో పని చేయాలని ఉప కమిషనర్ శశిరేఖ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# భూసేకరణ ఇబ్బందులతో నిలిచిన ప్రాజెక్టులు

**హైదరాబాద్**

ప్రాజెక్టులను ప్రతిపాదించాలి? భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలి? ఆ తర్వాత టెండర్లు ఖరారు చేయాలి? కానీ కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులకు భూములు లేకుండానే, టెండర్లు ఖరారు చేయడం ఆనవాయితీగా మారింది. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో చేస్తున్న హడావుడి మాత్రం అంచనాలకు మించిపోతున్నది. ఇప్పటివరకు ప్రతిపాదించిన ప్రాజెక్టులు కాగితాలు దాటకముందే, అనుమతులు, డిజైన్లు ఖరారు చేసి, టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్లకు పనులన్నీ కట్టబెట్టడం వరకు చకచకా సాగిపోతున్నాయి. ఆ తర్వాత భూసేకరణలో బాధితులు చెప్పే అభ్యంతరాలతో ప్రాజెక్టులు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి.

**కోర్టులను ఆశ్రయించి, వందలాది కేసులు..**

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఈ రెండు కీలక ప్రాజెక్టుల విషయంలో వందలాది మంది కోర్టులను ఆశ్రయించి, ప్రాజెక్టులకు భూములు ఇచ్చే అంశంలో వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడితో మాత్రం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించడం, వాటిని ఖరారు చేసి కంపెనీలకు కట్టబెట్టడం సర్వసాధారణంగా మారింది. ప్రాజెక్టులకు అవసరమైన భూములు లేకుండానే ప్రాజెక్టులకు టెండర్లను పిలిచి జనాలను మభ్యపెడుతుందే తప్ప.. ప్రతిపాదనల్లో ఎలాంటి పురోగతి ఉండటం లేదని రావిర్యాల గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్-1 విషయంలోనే తేటతెల్లమైంది. ఈ ప్రాజెక్టు కోసం వందలాది ఎకరాల పంట పొలాలను లక్ష్యంగా చేసుకుని భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టింది. అదే సమయంలోనే టెండర్లు ఖరారు చేసి ఓ వివాదాస్పద కంపెనీకి పనులు కూడా అప్పగించింది. కానీ ఇప్పటికీ ఈ ప్రాజెక్టుపై హైకోర్టులో వాదనలను బాధితులు వినిపిస్తూనే ఉన్నారు. ఇక ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు అంశంలో ఏకంగా 1000 మంది ప్రాజెక్టుకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించి, వారి ఆస్తులకు రక్షణ పొందుతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం మరోసారి టెండర్లు ఖరారు చేసి, ఓ కంపెనీకి కట్టబెట్టే పనిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ఫైనాన్షియల్, టెక్నికల్ బిడ్డింగ్‌లను కొలిక్కి తీసుకు రానున్నారు. ఇలా ప్రాజెక్టుల విషయంలో టెండర్లతో బాధితులను ఆందోళనకు గురి చేస్తోంది. కోకాపేట నుంచి పరిగి వరకు నిర్మించే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలోనూ హెచ్ఎండీఏకు రైతుల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లతో ఒరిగేదేమీ లేదని చెబుతున్నా? అభ్యంతరాలను స్వీకరిస్తున్నామని చెప్పి? టెండర్లు ఆహ్వానించే పనిలో అధికారులు ఉన్నారు.

**భూములు ఇచ్చేది లేదని చెబుతున్నా..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే శామీర్‌పేట-జేబీఎస్, ఎగ్జిట్ నంబర్..13 నుంచి ఫ్యూచర్ సిటీ వరకు, కోకాపేట నుంచి పరిగి మండలం చిట్యాల వరకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లను వేల కోట్ల రూపాయల అంచనాతో నిర్మించేందుకు ప్రతిపాదించింది. అవసరమైన భూముల సేకరణ జరగకుండానే, హెచ్ఎండీఏ మాత్రం టెండర్లు ఖరారు చేసే పనిలో ఉంది. ప్రధాన ప్రాజెక్టుల విషయంలో వందలాది మంది జనాలు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ప్రాజెక్టులోని లోపాలు, విధానపరమైన ఇబ్బందులు, వ్యక్తిగత నష్టపరిహారం విషయంలో భూములు ఇచ్చేది లేదని చెబుతున్నారు.

## శేరిలింగంపల్లి ఎమ్మెల్యే స్థానం స్పష్టత ఇవ్వాలి : బీ.ఆర్.ఎస్ నేతలు



**అస్త్రం, చందానగర్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారన్న విషయంపై ప్రజల్లో అయోమయం నెలకొందని బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు అన్నారు. స్పీకర్ నిర్ణయం ప్రకారం ఎమ్మెల్యే ఇంకా బీ.ఆర్.ఎస్ పార్టీలోనే ఉన్నారంటున్నారు. అలా అయితే ఈ నెల 21న కేసీఆర్ అధ్యక్షతన బీ.ఆర్.ఎస్ భవన్‌లో జరిగే పార్టీ సమావేశానికి గులాబీ కండువా ధరించి హాజరుకావాలని డిమాండ్ చేశారు. ఇకపై నియోజకవర్గంలో జరిగే ప్రతి బీ.ఆర్.ఎస్ కార్యక్రమంలో కండువాతోనే పాల్గొనాలని, లేని పక్షంలో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. గాజులరామారం, శంషిగూడలోని వివాదాస్పద భూముల అంశాలను కాపాడుకోవడానికే ఎమ్మెల్యే కాంగ్రెస్ వైపు వెళ్లారని ప్రజల్లో చర్చ జరుగుతోందని ఆరోపించారు. ఈ ఆరోపణలు నిజం కాదని నిరూపించుకోవాలంటే కుకట్పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు తరహాలో స్వయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు విజిలెన్స్ ద్వారా విచారణ కోరాలని సూచించారు. అలా చేయకపోతే ఆరోపణలు నిజమేనని ప్రజలు నమ్మే అవకాశం ఉందని హెచ్చరించారు. బీ.ఆర్.ఎస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే ప్రజలను అవమానించకుండా వెంటనే పార్టీకి విధేయత చూపాలని, లేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ప్రజల తీర్పు కోరాలని బీ.ఆర్.ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం బొబ్బ నవతా రెడ్డి అధ్యక్షతన జరగగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రవికుమార్ యాదవ్, వాలా హరీష్, సంగారెడ్డి తో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నహస్తం : ఎమ్మెల్యే గాంధీ



అస్త్రం, కొండాపూర్ : డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బీ బ్లాక్ కాలనీకి చెందిన సీతాదేవికి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,50,000/- ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్,ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఆపన్నహస్తంగా నిలుస్తోందని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిరియాల రాఘవ రావు, భగత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## సాయి బాబా ఆలయ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**అస్త్రం, గచ్చిబౌలి:**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలోని సాయి ఐశ్వర్య కాలనీలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సరం సందర్భంగా రూపొందించిన షిరిడి సాయిబాబా దేవాలయ క్యాలెండర్‌ను కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ పూజారులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. శిరిడీ సాయిబాబా బోధనలు సర్వమానవాళికి ఆదర్శమని, శ్రద్ధ సబూరి అనే సాయిబాబా సందేశం నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఆలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా, సామాజిక ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రాంత ప్రజల శ్రేయస్సు, శాంతి, సుఖసంతోషాలతో నిండిన జీవితం కోసం సాయిబాబా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ బొంత వెంకట నరసింహ మూర్తి, కార్యదర్శి భిక్షాల రావు, కోశాధికారి ఫణి కిషన్, ఆలయ కమిటీ సభ్యులు రమణి, విశాలాక్షి, సదానంద్, బండ రామ రెడ్డి, అశోక్ రాజు, మహేష్, ముక్తేశ్వర రావు, సుబ్రమణ్యం, ఫణీంద్ర, అశోక్, సత్య నారాయణ, సీనియర్ నాయకులు వసంత కుమార్ యాదవ్, ఈశ్వరయ్య, అరుణ్, తిరుపతి, రాజు, శ్రీను, గోవింద్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, భక్తులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.